మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## అంగన్‌వాడీ సేవలు..

# బయటికి కనిపించని అద్భుతమైన సేవలు

- ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంగన్‌వాడీలను బలోపేతం చేస్తే అద్భుతమైన ఫలితాలు..
- అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకుంటే సమాజంలో ఉన్న చాలా ఆరోగ్య సమస్యలు అరికట్టవచ్చు
- నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి సేవలు బలోపేతం చేసేందుకు ప్రజా ప్రతినిధుల పూర్తి సహకారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సమాజంలో అంగన్‌వాడిల ద్వారా చేస్తున్న సేవలు పైకి కనిపించవు కాని అవి సమాజరహితం కొరకు అమోఘమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కొనియాడారు. మంగళవారం ఉదయం మక్తల్ నియోజకవర్గంలోని అందరు ప్రజా ప్రతినిధులు,స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడి టీచర్లు,ఆయాలతో స్థానిక రవి ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడి సేవలు వారికి ప్రజా ప్రతినిధుల నుండి కోరుతున్న సహకారంపై సదస్సులో కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చాలా మందికి రక్తహీనత, అనారోగ్యం, అవసరమైన చురుకుదనం తెలివితేటలు వంటి రుగ్మతతో బాధ పడుతుంటార్నారు. ఇదంతా ఒక కాలచక్రం మాదిరి తిరుగుతుందన్నారు. ఈ అనారోగ్య రుగ్మతలను అరికట్టడానికి అంగన్‌వాడి కేంద్రంలో సేవలు చేస్తున్నారన్నారు. గర్భిణీలకు గుడ్లు, పౌష్టికాహారం, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సమయానికి టీకాలు ఇప్పించడం, ప్రసవం తర్వాత 6 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం, టీకాలు, ఆట పాట ద్వారా విద్య నేర్పుతూ పాఠశాలకు వెళ్లి చదువుకోవడానికి మానసికంగ పిల్లలను సిద్ధం చేస్తున్నారన్నారు. అలా ఎదిగిన పిల్లలు భవిష్యత్తులోచాలా హుషారుగా తెలివితేటలతో విద్యలో రాణిస్తారన్నారు. కానీ పిల్లలు గర్భంలో ఉన్నప్పుడే గ్రామాల్లో గర్భిణీలు కూలీ ఇతర వ్యవసాయ పనులు చేసు కుంటూ సరైన పౌష్టికాహారం లేకుండా రక్తహీనతకు గురవుతున్నారని తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చి సిజేరియన్ కావడం, పుట్టిన పిల్లలు అనారోగ్యంతో ఉండడం, తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. అదేవిధంగా కొంతమంది బాల్య వివాహాలు చేయడం తద్వారా తల్లి బిడ్డకు అనారోగ్య సమస్య లు పుట్టిన పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేకుండా ఉంటున్నారన్నారు.ఇలాంటి అన్ని ఆరోగ్య సమస్యలకు ముగింపు పలకడానికి అంగన్‌వాడి సేవలు సద్వినియోగం చేసుకోవడం ఒక్కటే మార్గమన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు చాలా బాగా పని చేస్తున్నారని వారి సేవలను ప్రశంసించారు.అయితే గ్రామాల్లో గర్భిణీలు పనికి వెళుతూ పాలు, గుడ్లు, పౌష్టికాహారం తీసుకోవడానికి అంగన్‌వాడి కేంద్రాలకు వెళ్లడం లేదన్నారు. పోనీ ఇవన్ని ఇంటికే పంపిస్తే పాలతో కుటుంబ అంతా చాయ్ కాచుకుని తాగడం,గుడ్లను ఆమ్లెట్ చేసుకుని అందరు తినడం జరుగుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు భాగస్వాములై ముందుకు వస్తే ఎంత మంచి అద్భుతాలు సాధించగలమో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో చూడడం జరిగిందన్నారు. అందుకే సమాజ హితం కోసం ఇంత మంచి సేవలు అందిస్తున్న అంగన్‌వాడి సేవలను మరింత బలోపేతం చేసి సద్వినియోగం చేసేందుకు ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించడం, ప్రతి బుధవారం 10 నిమిషాల అంగన్‌వాడి సమావేశంలో పాల్గొని సమస్యలు తెలుసుకోవడం వాటిని అధికారులతో సమన్వయ పరచుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తే తక్కువ సమయంలోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని తీసుకురావచ్చన్నారు. ఇందుకు జిల్లాలోని ఏ అంగన్‌వాడి కేంద్రంలో అయినా సరే ప్రజా ప్రతినిధులు మౌలిక వసతులు కల్పించేందుకు ముందుకు వస్తే వారు ఖర్చు చేసే మొత్తంలో సగం నిధులు తన సిబిఎఫ్ నిధుల నుండి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అంగన్‌వాడి సేవలను ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. మక్తల్ మండలం ఖానాపూర్ గ్రామ పంచాయతీకి నేషనల్ అవార్డు రావడానికి ప్రజాప్రతినిధుల పాత్ర చాలా ఉందన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చేరువ చేసి వారిని గురుకులాలలో, కెజిబివిలలో చేర్పించడం జరిగిందన్నారు. అంగన్‌వాడి సెంటర్‌లలో ప్రిస్కూల్ ఆక్టివిటీస్‌లు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారి ప్రతి అంగన్‌వాడి సెంటర్‌లకు వచ్చే ప్రతిచిన్న పిల్లలకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందించడం జరుగుతుందన్నారు. ఊరు మనబడి పనులు విజయవంతం కావడానికి ప్రజా ప్రతినిధుల కృషి చాలా ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో అంగన్‌వాడి కేంద్రాలకు చైర్మన్ సర్పంచ్ అన్ని అన్నారు. సర్పంచ్‌లు బాధ్యతగా పనులు చేయాలన్నారు. నారాయణపేట జిల్లా కొత్తగా చివరగా ఏర్పాడినప్పటికి ప్రజా ప్రతినిధుల కృషి, అధికారుల సహకారం సమన్వయంతో రాష్ట్రంలో అన్ని రంగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలుస్తున్నామని సగర్వంగా తెలియజేశారు. అంగన్‌వాడి సేవలు ఏ విధంగా పని చేస్తున్నాయి, వాటి ఫలితాలు ఏ విధంగా ఉన్నాయి, ప్రజా ప్రతినిధుల సహకారం అందిస్తే ఎలాంటి అద్భుతాలు చేయగలమో తెలపడానికి ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినందుకు జిల్లా కలెక్టర్‌ను జిల్లా సంక్షేమ అధికారిని ప్రశంసించారు. అంగన్‌వాడి టీచర్ ఇంట్లో ఒక తల్లి మాదిరిగా పిల్లలకు ఆటపాటల ద్వారా లాలించడం, సమయానికి గుడ్లు, పౌష్టికాహారం అందించడం బాలామృతం తినిపించి పిల్లలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్ది విద్యను సైతం అందిస్తుందన్నారు. అయినప్పటికి ప్రజలకు సరైన అవగాహన లేక అంగన్‌వాడిలను చాలా చులకనగా చూస్తారని అన్నారు. ఇక నుండి ఈ నియోజకవర్గంలోని అన్ని వార్డులు, గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు తమవంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చి అంగన్‌వాడి కేంద్రాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి సేవలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఏ గ్రామ పంచాయతీకి అంగన్‌వాడి భవనం అడిగిన తన నిధుల నుండి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇంకా ఎవరు అడిగినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శిశువు గర్భంలో ఉన్నప్పటి నుండి పుట్టబోయే పిల్లవాడు పౌష్టికంగా ఉండాలనే ఉద్దేశంతో అంగన్‌వాడి కేంద్రాలలో పౌష్టికాహాలను సమకూర్చడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ 50 రిజర్వేషన్‌లను కల్పించడం జరిగిందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్‌ల సేవలు అభినందనీయమన్నారు. సర్పంచ్‌లు వారానికి ఒక్కరోజు తిరిగి సమావేశాలకు తెలంగాణా ప్రభుత్వం ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని చాలా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అంగన్‌వాడిల నిర్మాణానికై జడ్పీ నిధులతో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజా ప్రతినిధులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన కొత్తపల్లి అంగన్‌వాడి టీచర్, విద్యాశాఖలో పని చేస్తున్న పద్మజా,సచ కేంద్రం లీగల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, జిల్లా సంక్షేమ శాఖ ఉద్యోగిని భారతిలకు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. అవగాహన సదస్సుకంటే ముందు పట్టణంలో ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అదనపు భవనంలో శిశు అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. భవనంలో మహిళలకు కుట్టు మిషన్ నైపుణ్య శిక్షణ నేర్పించుటకై కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సమావేశ మందిరంలో అంగన్‌వాడి టీచర్‌లు గర్భిణీకు, చిన్న పిల్లలకు అందించే వాటిని స్టాల్స్‌లను అతిథులు సందర్శించారు. అనంతరం వికలాంగులకు చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, జడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, మున్సిపల్ చైర్మన్ పావని, సిడబ్ల్యుసి చైర్మన్ అశోక్, జడ్పీటిసిలు వెంకటయ్య, అశోక్‌గౌడ్,జ్యోతి, ఎంపిపిలు వనజమ్మ,ఎంపిడిఓలు, ఎంపిఓలు, సర్పంచ్‌లు, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రెటరీలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

## వరి ధాన్యం కొనుగోలుకు

# పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఐడీఓసీ లో రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అవగాహన సదస్సు కో ఆర్డినేషన్ మీటింగ్ అధికారులు ప్రజాప్రతి నిధులతో సమావేశం జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డితో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. మిల్లులకు నాణ్యమైన వరి ధాన్యాన్ని తరలించే విధంగా రైతులు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. వరి ధాన్యం నాణ్యవంతంగా పండిం చడానికి రైతులు పంట మార్పిడి చేస్తే మంచిగా ఉంటుందని అన్నారు. రైతులకు మిల్లు యజమానాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రం దగ్గర ప్లెక్సీ ఏర్పాటు చేసి తేమ వాతం తదితర వివరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కృషి కేంద్రం దగ్గర క్లీనింగ్ మిషన్ తేమ శాతం కొలిచే పరికరాలు, త్రాగునీరు ఇతర ఏర్పాట్లు చేయాలని అన్నారు. గన్ని బ్యాగులు అందు బాటులో ఉంచుకోవాలని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం దగ్గర రైతులు వారి టోకెన్ల ప్రకారం వరి ధాన్యం తీసుకురావాలని ఆధార్ కార్డును నమోదు చేయాలని అన్నారు. ఎఫ్‌టీఓ జనరేషన్ 48గంటలోపు జరగాలని, మనసు పెట్టుకొని పని చేయాలని జిల్లా రైతులకు న్యాయం చేస్తామని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రేపటి నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అన్నారు. 259 సెంటర్స్,జిల్లాలో నాలుగు లక్షల టన్నుల వరి ధాన్యం సేకరించే ప్రణాళిక పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే 40 లక్షల గన్నీ బ్యాగులు ఉన్నాయని, మిగతా బ్యాగులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లు వారు రైతులకు సహకరించాలని తెలిపారు. రవాణా విషయంలో రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు సమితి అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వరి ధాన్యం సేకరణ విజయ వంతంగా సేకరించి మిల్లర్లకు అందజేశారని, ఈసారి కూడా విజయవంతంగా వరి ధాన్యం సేకరించాలని అన్నారు. వర్షం తడవకుండా తాడ్పాల్‌అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ సమావే శంలో డీఎస్ఓ సుదర్శన్, డీఎం సివిల్ సప్లై కొండల్‌రావు, డీఆర్డీఓ నరసింహులు, వ్యవసాయాధకారి కో ఆపరే టివ్ అధికారులు, మార్కెటింగ్ అధికారి సర్వాన్‌సింగ్, ఎంపీపీ, జడ్పీటీసీలు, రైతు సమన్వయ సమితి, డీసీసీబీ డైరెక్టర్లు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, సొసైటీ అధ్యక్షుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



మద్దతు ధర ప్లెక్సీలు ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు

# రఘునందన్..బ్లాక్ మెయిల్ రాజకీయాలకు మా నేత నిరంజన్‌రెడ్డి భయపడరు

- రాజకీయంగా ఎదుర్కోనే శక్తి లేకనే బురదజల్లే చర్యలకు పూనుకుంటున్న బీజేపీ నాయకులు..
- రఘునందర్ రావు బేషరత్తుగా క్షమాపణ చెప్పకపోతే చట్టబద్ధమైన చర్యలకు సిద్ధంగా ఉండాలి..
- మూడు వ్యవసాయ క్షేత్రాల భూములు చట్టబద్ధంగా కొనుగోలు చేసినవే.. నచ్చిన సర్వేయర్లతో సర్వే చేయించుకో..
- చట్ట పరధి కంటే ఒక్క గుంట భూమి ఎక్కువ ఉన్న ఆ భూములను వదిలేస్తా.. నా పదవికి రాజీనామ చేస్తా..లేకుంటే నీ ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేయగలవా..?
- బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావుపై మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రెస్ నోట్ విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి వ్యవసాయక్షేత్రానికి సంబంధించిన భూవివరాలను చూయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రఘునందన్ రావు..బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకో మీ విషప్రచారానికి తమ నాయకుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో భయపడబోరని, బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ హెచ్చరించారు. మంగళవారం మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడడంతో పాటు మంత్రి ప్రెస్ నోట్ ను గట్టు యాదవ్ విడుదల చేశారు. బీజేపీ దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిరంజన్‌రెడ్డి పై పలు అవినీతి ఆరోపణలు చేయడం పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంజన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ నాయకులు అవినీతి బురదజల్లే చర్యలకు పూనుకుంటున్నారని, నిరంజన్ రెడ్డి పై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవడంతో పాటు మంత్రి బేషరత్తుగా క్షమాపణ చెప్పకపోతే రఘునందన్ రావు చట్టబద్ధమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని గట్టు యాదవ్ కోరారు. తమ నాయకునికి ఉన్న 3 వ్యవసాయ క్షేత్రాల్లో ఒక్క గుంటభూమి కూడా చట్టబద్ధంగా కొనుగోలు చేసినదానికంటే ఎక్కువగా లేదని, అలా ఉంటే తమ మంత్రి కూతుళ్ల కొనుగోలు చేసిన భూమిని వదిలివేయడానికి సిద్ధంగా ఉన్నారని దాంతో పాటు తన పదవికి కూడా రాజీనామ చేస్తానని, మంత్రి తన ప్రెస్‌నోట్ లో పేర్కొన్నారు. మంత్రి స్వగ్రామమైన పాన్‌గల్‌లో 2014-18 ఎన్నికల అఫడమిక్‌లో పేర్కొన్నవే ఆ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నదని, మంత్రి సతీమణి సొంత డబ్బులు బ్యాంకు లోన్‌తో ఇళ్లు కట్టుకోవడం జరిగిందని, వారు పేర్కొన్నారు. విదేశాల్లో చదువుకొని విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న మేజర్లు అయిన తన ఇద్దరు కూతుళ్ల స్వార్జితంతో చుండూరులో సురవరం ప్రతాపరెడ్డి వారసులు, ఇతరుల నుండి చట్టబద్దంగా భూములు ఖరీదు చేయడం జరిగిందని, ఆయన పేర్కొన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఏదో రంధ్రాన్వేషణ చేసినట్లు తొలూత భూములు కొని ఎస్టీల పేరు మీదకు, తరువాత మంత్రి కుటుంబ సభునయల పేరుమీదకు వెళ్లాయని, రఘునందన్ రావు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని తల్లిదండ్రులను కోల్పోయిన గౌడ నాయకులను చేరదీసి ఇంట్లో పెట్టుకొని పెంచి పెద్దచేసి ఉన్నత చదువులు చదివించింది వనపర్తి నియోజకవర్గ ప్రజలందరికి తెలుసు అని గౌడ నాయక్ తమ కుటుంబ సభ్యుడేనని ప్రస్తుతం ఇంటి వ్యవహారాలు అతనే చూసుకుంటున్నాడని ఆయన పేర్కొన్నారు. 3 వ్యవసాయ క్షేత్రాలను రఘునందర్ రావుకు నచ్చిన వాళ్లతో వచ్చి సర్వే చేయించుకొని వెళ్లవచ్చునని చట్ట ప్రకారం లేకుంటే తాను భూమి వదిలేస్తానని, తన పదవికి కూడా రాజీనామ చేస్తానని మంత్రి విడుదల చేసిన ప్రెస్ నోట్ లో రఘునందన్ రావు కు సవాల్ విసిరారు. తనపై ఆరోపణలను నిరూపించలేకపోతే ఎమ్మెల్యే పదవికి రఘునందన్ రావు రాజీనామా చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ బి.లక్ష్మయ్యా, మార్కెట్ కమిటీ చైర్మెన్‌రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ శిక్షణ కమిటీ చైర్మెన్ పురుషోత్తం రెడ్డి, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు పాకనాటికృష్ణ, బీఆర్ఎస్‌పార్టీ నాయకులురహీం, ఉంగ్లం తిరుమల్, నరసింహ, రఘు, సర్పంచ్ గౌడ నాయక్, కురుమూర్తి లు ఉన్నారు.

## బంగారు తెలంగాణ పేరుతో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు

- మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి



చిన్నారులతో మాజీ మంత్రి చిన్నారెడ్డి

**వనపర్తి రూరల్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వనపర్తి మండలంలో మాజీ మంత్రి ఏఐసీసీ కార్యదర్శి పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ డా.జి.చిన్నారెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిన అధికార పార్టీ నాయకులు రాష్ట్రాన్ని రాబందుల్లా దోచేస్తున్నారని ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా వనపర్తి మండలం రాజాపేట, రాజపేట తాండా, అచ్యుతాపురం, అప్పాయిపల్లి, అప్పాయిపల్లి తాండాల్లో ఆయన పర్యటించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, పాలనను గాలికి వదిలేసి బంగారు తెలంగాణ పేరుతో అప్పు రాష్ట్రంగా మార్చరని మండిపడ్డారు. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ తొమ్మిదేళ్లలో రూ.25 లక్షల కోట్లు కల్వకుంట్ల కుటుంబం దోచుకుందని అన్నారు. బీఆర్ఎస్ పాలనను ఇంకా భరిద్దామా అని కలిసి పోరాడుదాం అంటూ ప్రజలను ప్రశ్నించారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమం, అభివృద్ధి సమానంగా అమలవుతుందని,నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రూ.2500 ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో వనపర్తి జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌నారాయణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, మెంటపల్లి రాములు,బొంబాయి మన్నెంకొండ, ధర్మారెడ్డి, రాజాపేట మాజీ సర్పంచ్ బాలరాజు,రాజపేట రాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దివాకర్ యాదవ్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం.దేవన్న యాదవ్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, నరేందర్ రెడ్డి, అబ్దుల్లా, బి.నరసింహ, శ్రీనివాసులు, దిలీప్ కుమార్, మండల కోఆర్డినేటర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

# నాగవరంలో ఘోర రోడ్డు ప్రమాదం

## ▶▶భార్యాభర్తలు మృతి, చిన్నారి క్షేమం..

**వనపర్తి క్రైమ్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** బైక్‌పై భార్యభర్తలు తమ కూతురితో వెళ్తూ సమీపంలో యూ టర్న్ తీసుకుంటుండగా పెట్రోల్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొన్న సంఘటనలో అక్కడిక్కడే భార్యభర్తలు మృతి చెందగా చిన్నారికి తీవ్ర గాయాలు అయిన సంఘటన వనపర్తి జిల్లా నాగవరం గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ ప్రకారం గోపాల్‌పేట గ్రామానికి చెందిన కురుమూర్తి (40) భార్య రజిత (32), చిన్నారి తను శ్రీ(4) లతో కలిసి బైక్ పై నాగవరం గ్రామ శివారులో గల ఓ ఫంక్షన్‌హాల్ లో జరిగిన వేడుకకు హాజరై అదే గ్రామంలో ఉన్న రజిత తల్లి బాలీశ్వరమ్మ ను చూడడానికి బైక్‌పై వెళ్తూ యూటర్న్ తీసుకొనే సమయంలో పెట్రోల్ ట్యాంకర్ వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే భార్యభర్తలు మృతి చెందగా చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది, చిన్నరిని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టు కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సంఘటన స్థలంలో చెల్లాచెదురుగా పడిన భార్యభర్తల మృతదేహాలు



మృతులు కురుమూర్తి, రజితల (ఫైల్)

# హ్యాట్రిక్ కొట్టనున్న బీఆర్ఎస్ సర్కార్..

- సంక్షేమ పథకాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి...
- పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తా: ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి
- మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం

**కల్వకుర్తి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సీట్లు సాధించి హ్యాట్రిక్ విజయాన్ని బీఆర్ఎస్ పార్టీ నమోదు చేస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కసరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీ పార్టీలు తెలంగాణను పాలించారు కానీ అభివృద్ధిని విస్మరించారన్నారు. 60 ఏళ్లలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని 9ఏళ్లలో బీఆర్ఎస్ సర్కార్ చేసి చూపించిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు నల్లేరు మీద నడకేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం రావడం వల్లే కేఎల్ఐ నీళ్లు వచ్చాయని, కేఎల్ఐ నీళ్లు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు వేళ్లాలా చూస్తానని హామీ ఇచ్చారు. కేఎల్ఐ కాల్వలను పూర్తి చేసేందుకు మంత్రి కేటీఆర్‌ను కలుస్తానన్నారు. ప్రజా ప్రతినిధులతో, అధికారులతో కలిసి సమన్వయంతో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ గెలుపుకు పనిచేస్తామన్నారు. ఉద్యమ సారథి సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పాటు పడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, అనుకున్నంత అభివృద్ధి కల్వకుర్తిలో కనిపించడం లేదన్నారు. నాయకత్వ మార్పుతోనే కల్వకుర్తి అభివృద్ధి బాటలో పయణిస్తుంది. రానున్న ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్ కసిరెడ్డి నారాయణరెడ్డికి కేటాయించాలని వెల్దండ పీఏసీఎస్ వైస్ చైర్మన్ వావిళ్ల సంజీవ్‌కుమార్‌యాదవ్ అధిష్టానాన్ని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, జిల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు,నాయకులు భగత్‌సింగ్, వెంకటేష్‌గౌడ్, యల్లారెడ్డి,పద్మారెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాములు, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



## ఆటో ఢీకొని చిన్నారి మృతి

**కొత్తకోట,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మంచినీటి సరఫరా చేసే ఆటో ఢీకొని చిన్నారి వర్షిని(3) మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పాలెం గ్రామంలో చోటుచేసుకుందని ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల లక్ష్మీ కురుమూర్తి దంపతులకు కుమార్తె వర్షిణి సీసీ రోడ్డు దాటే క్రమంలో గ్రామానికి చెందిన మంచినీటి సరఫరా చేసే ఆటో అజాగ్రత్తగా నడుపుకుంటూ డ్రైవర్ హరికృష్ణ చిన్నారిని ఢీకొట్టడంతో చిన్నారికి బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. చిన్నారి తల్లి మాచర్ల లక్ష్మీ ఫిర్యాదుమేరకు ఆటో డ్రైవర్ హరికృష్ణ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



చిన్నారి వర్షిణి మృతదేహం

## సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన పి.స్వాతికి మంజూరైన రూ.14 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తన నివాసంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల పాలిటవరమన్నారు. అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారని, సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో.. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డికె అరుణ

**ధరూర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేదలకు పని కల్పించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 100 రోజుల పనిని కల్పిస్తూ, ఉపాధి హామీ పని కూలీలకు చెల్లించే డబ్బులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ అన్నారు. మండల సమీపంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం చేస్తున్న కార్మికులకు క్షేత్రస్థాయిలో అన్ని వసతులు గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కల్పిస్తున్నారా అంటూ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. చలువ పందిళ్లు, మెడికల్ కిట్స్, టెంట్స్, మంచినీటి సౌకర్యం లాంటి ప్రతిది కూడా పని జరిగే ప్రదేశాల్లో ఉండేలా ఫీల్డ్ అసిస్టెంట్ కల్పించాలని లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ధరూర్ మండలానికి చెందిన మేరీ పుట్టుమూగ అయిన అర్హత ఉన్న పింఛన్ ఇవ్వడం లేదని డికె అరుణకు విన్నవించారు. కార్యక్రమంలో గడ్డంకృష్ణారెడ్డి, రామాంజనేయులు, జిల్లా బిజెవైఎం అధ్యక్షులు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ధరూర్ కిష్టన్న, రామకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన విఓఎలకు సిసిలుగా ప్రమోషన్లు కల్పించాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్



**లింగాల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల మహిళా సమాఖ్యలో పని చేస్తున్న ఐకెపి విఓఎలను అర్హులైన వారిని సిసిలుగా ప్రమోషన్లు కల్పించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం ముందు నిరవధిక సమ్మె రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి విఓఎలు అనునిత్యం కృషిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న విఓఎలకు రూ. 26 వేలు ఇవ్వాలని, సెర్ప్ నుండి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విఓఎలతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదని విఓఎలపైన మహిళా సంఘాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఎస్‌హెచ్‌జిలకు విఎల్ఆర్ అభయహస్తం డబ్బులు చెల్లించాలని ఎస్‌హెచ్‌జి విఓఎల లైవ్ మీటింగ్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి, ఆయా గ్రామాల విఓఎలు విజయ, సైదా, పూజిత, చంద్రశేఖర్, శ్రీను, వెంకటయ్య, రాము, దేవేందర్, బుచ్చిరాజు, శ్రీశైలం, అంజి, ప్రదీప్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరి మృతి

మహబూబ్‌నగర్, రాయచూర్ ప్రధాన రహదారిపై ఘటన

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మహబూబ్‌గనర్ రాయిచూర్ ప్రధాన అంతరాష్ట్ర రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. కర్ణాటకకు చెందిన ఆర్టీసి బస్సు ఆటో పరస్పరం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మణికొండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్య మహాసభ నేతలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విద్యాకమిటీ ఛైర్మన్, శ్రీశైలం మల్లిఖార్జున అన్నసత్రం ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, సత్రం డైరెక్టర్ బచ్చు రామకృష్ణ, సత్రం కార్యదర్శి బలుసశ్రీరాములు, డైరెక్టర్లు మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, పోల విష్ణు, జిల్లా పీఆర్ఓ మిర్యాల రాజయ్యలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మే నెలలో నిర్వహించే మల్లిఖార్జున అన్నదాన సత్రం ప్రారంభోత్సవానికి విచ్చేయాలని రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. అన్నదాన సత్ర ప్రారంభోత్సవానికి విచ్చే స్తానని సూచిస్తూ ఆర్యవైశ్య మహాసభ నేతలను అభినందించారు. అంతకు ముందు జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.



అన్నదాన సత్ర ప్రారంభోత్సవానికి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

# ఎర్రవల్లి చౌరస్తా కొత్త మండల ఏర్పాటుకు ప్రభుత్వం గెజిట్ విడుదల

- 13 గ్రామ పంచాయతీలతో కలిపి కొత్త మండల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- 15 రోజులపాటు అభ్యంతరాల స్వీకరణకు గడువు



గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంతో సంబరాలు చేసుకుంటున్న అఖిల పక్ష కమిటి నాయకులు

**ఇటిక్యాల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా గ్రామ పంచాయతీగా కొనసాగుతుండగా కొత్తగా మండల ఏర్పాటు చేయాలని అచల పక్ష కమిటి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు, పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి చౌరస్తా కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా మంత్రులు, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకుపోయి ఎర్రవల్లి చౌరస్తా కొత్తమండల ఏర్పాటుకు అన్ని వనరులు వసతులు ఉన్నాయని వారు కోరడంతో స్పందించిన ప్రభుత్వం మంగళవారం కొత్త మండలం ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 15 రోజుల్లోగా అభ్యంతరాలను స్వీకరించాలని వాటి నివేదికను ప్రభుత్వానికి పంపించాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అచలపక్షం కమిటి ఆధ్వర్యంలో జులై 26వ తేదీన 20కి.మీ. మేర ఎర్రవల్లి చౌరస్తా నుండి జోగులాంబ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌కు ఎర్రవల్లి చౌరస్తాను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా గత సంవత్సరం జులై 28 నుండి దాదాపు పది రోజుల పాటు ఎర్రవల్లి చౌరస్తాలో అన్ని గ్రామాల నుండి అన్ని పార్టీల ఆధ్వర్యంలో అచలపక్షంగా ఏర్పడి రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టారు. ఈ సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం హాజరై కొత్త మండలం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని రిలే నిరాహార దీక్షలను విరమించాలని అచలపక్షం కమిటిని కోరారు. దీంతో రిలే నిరాహార దీక్షలను వాయిదా వేసేందుకు నిర్ణయించుకున్నారు. అచలపక్షం ఆధ్వర్యంలో కొత్త మండల ఏర్పాటుకు చేపట్టిన ఉద్యమం దాదాపు 9 నెలలకు ప్రభుత్వం స్పందించింది. ఈ సందర్భంగా గజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంతో పార్టీలకతీతంగా మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జాతీయ రహదారి పైకి వచ్చి బాణాసంచా పేల్చి అన్ని పార్టీల ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు.




జులై26న ఎర్రవల్లి చౌరస్తాను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని పాదయాత్ర చేపట్టిన అఖిల పక్షం కమిటీ నాయకులు (ఫైల్)

13 గ్రామ పంచాయతీలతో కొత్త మండలం ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం ఎర్రవల్లి చౌరస్తా కొత్తమండలం ఏర్పాటు చేసేందుకు మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎర్రవల్లి, బీచుపల్లి, షేక్‌పల్లి, శాసనూలు బి వీరాపురం, ఆర్ గార్లపాడు, ధర్మవరం, పుటాన్ దొడ్డి, వేముల, కోదండపురం, జింకలపల్లి, కొండేరు, తిమ్మాపురం, గ్రామాలతో కొత్త మండల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

## రైతులకు న్యాయ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్
- అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించిన జిల్లా సీనియర్ సివిల్ జడ్జి

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** సింగారం గ్రామ రైతు వేదికలో జిల్లా న్యాయసేవ అధికా సంస్థ ఆధ్వర్యంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌కు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దామోదర్‌గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, సింగిల్‌విండో ఛైర్మన్, సింగారం గ్రామ సర్పంచ్, గ్రామ రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ మండల వ్యవసాయ అధికారి రైతు సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ పద్మమ్మ, బార్ కౌన్సిల్ సభ్యులు భీంరెడ్డి, ఎఈఓలు సోనిరవి, రవిందర్, ప్రకాష్, ప్రభాకర్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం జరిగిన రైతుల అవగాహన సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మొట్టమొదట రాష్ట్రంలోనే నారాయణపేట జిల్లాలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ని సింగారం గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేయడం జరిగిందని రైతులకు న్యాయ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే ఈ అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను రైతులందరు వినియోగించుకోవాలని రైతుల శ్రేయస్సు కొరకు వ్యవసాయ శాఖ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ జునిరాయ్ సివిల్ జడ్జి మొహ్మద్ ఉమేర్ సివిల్‌జడ్జి మాట్లడుతూ రైతులందరు భూతగాదాల తోగాని అదేవిధంగా విత్తనాల కొనుగోలు, వివిధ న్యాయ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే వారు చక్కగా ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సంప్రదించినట్లయితే వారికి తగిన న్యాయ సహకారం అందించబడుతుందని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం రైతుల బాగు కోసమే ఇక్కడ నారాయణపేట జిల్లాలో సింగారం గ్రామ రైతు వేదికలో ఈ అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ క్లినిక్‌లో పారా వాలంటీర్స్‌ను హైకోర్టు నుంచి నియమింపజేసి ఎలాంటి న్యాయపరమైన సమస్య ఉన్నా రైతులందరికి ఉచితంగా న్యాయ సహారం అందిస్తామని ఈ న్యాయ సేవ అధికార సంస్థను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతిరోజు మా పారా వాలంటీర్స్ గ్రామ రైతు వేదికలో అందుబాటులో ఉంటారని ఎలాంటి న్యాయ సహకారం ఉన్న వారందరూ ఈ అగ్రి క్లినిక్‌ను ఉపయోగించుకోవాలని రైతులందరు పంట మార్పిడి సేంద్రీయ వ్యవసాయం అదేవిధంగా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకుని రైతులు వారు అభివృద్ధి చెందుతూ సమాజానికి కూడా మంచి ఆహార ధాన్యాలను అందిస్తూ సమాజ శ్రేయస్సుకు కూడా తోడ్పడాలని సీనియర్ జడ్జి తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్



హాజరైన రైతులు

## ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యాన్ని, మద్యాన్ని నియంత్రించడానికి చెక్‌పోస్టుల ఏర్పాటు

- నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర డిజిపి అంజనీకుమార్ తెలంగాణ ఇతర రాష్ట్రాలకు అనుసంధానం ఉన్న జిల్లాల ఎస్పీలకు, కమిషనర్లకు విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి మాటాడుతూ రాబోయే ఖరీఫ్ కొనుగోలు సీజన్‌లో పొరుగు రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రానికి తీసుకొస్తున్న వరిధాన్యాన్ని, లిక్కర్ (మద్యం) ఏవైనా ఉంటే తెలంగాణకు రాకుండా పకడ్బందీగా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని , బోర్డర్ చెక్‌పోస్టులపై నిఘా ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని, స్థానిక రైస్‌మిల్లర్లు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లను గుర్తించి తెలంగాణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అలాగే ముందస్తు సమాచారం సేకరించి కట్టడి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నుండి ఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఎస్ఓ శివప్రసాద్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎల్. నరసింహ మొదలగు వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుండి నారాయణపేట జిల్లాలోనివరిధాన్యం, మద్యం రాకుండా నారాయణపేట జిల్లా సరిహద్దుల్లో 4 చెక్‌పోస్టులను రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ విడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్‌ఎక్సైజ్‌సూపరింటెండెంట్ ఎల్. నరసింహడిసిఎస్ఓశివప్రసాద్‌రెడ్డి, ఎక్సైజ్ సిఐనాగేందర్, ఎస్‌బిసిఐ రామ్‌లాల్, ఎస్సై నవీన్ పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిజిపి, కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్పీ

## ప్రోటోకాల్ పాటించలేదని అలిగిన ఎంపిపి!?

ప్రాధేయపడిన ఐసిడిఎస్ పిడి

**మక్తల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్, జిల్లా జడ్పీ ఛైరపర్సన్ అధ్యక్షతన మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని మక్తల్‌లో ఎంపిపిగా ఉన్న తనను స్టేజీపైకి ఆహ్వానించలేదని మక్తల్ ఎంపిపి వనజమ్మ అలిగి కిందనే వారికి మద్దతుగా వివిధ మండలాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపిపి జిల్లా అధికారి నిలదీసింది. మహిళా అభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అవగాహన సదస్సు కార్యక్రమంలో తను ప్రాతినిధ్యం వహిస్తున్న మక్తల్ మండల కేంద్రంలో జరుగుతున్న ప్రోటోకాల్ ప్రకారం తనకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర అధికారులను వేదికపైకి పిలవడం నన్ను కించపరిచినట్లే కదాని మహిళ సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ నిలదీశారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గమనించడం చివరకు సమావేశానికి హాజరైన ఎంపిటిసి, ఎంపిపి, జడ్పీటిసిలు, సర్పంచ్‌లు గమనిస్తుండగా క్షమాపణ కోరడంతో అప్పుడు ఎంపిపి వేదికపైకి వెళారు. ఇదంతా గమనిస్తున్న కొందరు సిడిపిఓకు ఎవరిని ఆహ్వానించాలి, ఎవరిని ఆహ్వానించకూడదు అని కనీసం అవగాహన లేదని తనకు ఇష్టం వచ్చినట్లు ఒంటెద్దు పోకడలకు పోతున్నారని అలాంటి అధికారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు మాట్లాడుకున్నారు.



ఎంపిపిని క్షమాపణ కోరుతున్న ఐసిడిఎస్ పిడి

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

-ఒక్కరోజే వచ్చిన 2,813 కింటాళ్ల సోన, 200 కింటాళ్ల హంస

**దేవరకద్ర, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం వరిశధాన్యం పోటెత్తింది. వరి కోతలు ప్రారంభం కావ డంతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు వరి ధాన్యాన్ని రైతులు పెద్ద మొత్తంలో తీసుకవస్తున్నారు. రోజురోజుకు మార్కెట్‌కు రైతులు తీసుకవచ్చే ధాన్యం పెరుగుతుందే తప్ప తగ్గడలేదు. దీంతో మార్కెట్‌లో వరి ధాన్యం నిల్వలు పేరుకపోతున్నాయి. ఎక్కడ చూసిన ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి.

**-ఒక్కరోజే వచ్చిన 2813 కింటాళ్ళ సోన, 200 కింటాళ్ళ హంస ధాన్యం..**

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు 2813 కింటాళ్ళ సోన ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2109 ధర పలికిం ది. అలాగే అతితక్కువగా రూ.1489 ధర పలికింది. అలాగే 200 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1668 ధర పలికింది. అతితక్కువగా రూ.1489 ధర పలికింది. 48 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుక వచ్చారు. కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.5579 ధర పలికంది. అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.



దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

## సోదర భావంతో మెలగాలి..

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**పాన్‌గల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మతాలకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మసీదులో ముస్లిం సోదరుల కోసం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాము యాదవ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ సోదరుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, మండల కేంద్రంలో త్వరలోనే షాదీఖానా నిర్మాణం కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మెన్ సోమ్‌నాథ్ నాయక్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, శేఖర్ నాయక్ తో పాటు గ్రామస్థులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## 25న ఉద్యోగ మిలియన్ మార్చ్

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మనోహర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈనెల 23న రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా ఈనెల 21న ఉమ్మడి పాలమూరులో నిర్వహించే మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని 25న నిర్వహించనున్నట్లు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మనోహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర కోశాధ్యక్షులు బండారి శాంతి కుమార్‌తో కలిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల 30 లక్షల మంది నిరుద్యోగ యువతీ, యువకులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు పరీక్ష పత్రాలు లీకేజీ కావడం అంటే సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి జైలుకు పంపించడం కాదు, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే అన్నితానై వ్యవహరిస్తున్న రాష్ట్ర మంత్రి కెటిఆర్‌ను వెంటనే మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కావడంతో నష్టపోయిన నిరుద్యోగులకు లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మిలియన్ మార్చ్ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు అందరు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు ఎగ్గని నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పార్టీ కార్యాలయ ఇంఛార్జి సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు దుస్తులు పంపిణీ

**కోయిల్‌కొండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ శివారెడ్డిలు ముస్లిం సోదరులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలందరికి దుస్తులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులువెంకటేష్, కనకయ్య, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి



ఉపాధి కూలీలకు నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

**పాన్‌గల్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి రోజు పనిచేస్తున్న కూలీలకు వేసవికాలం సందర్భంగా మౌలిక వస తులు కల్పించాలని సర్పంచ్ శాంతమ్మ కోరారు. మంగళవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో స్థానిక పంచాయితీ కార్యదర్శి నర్మదతో కలిసి ఆమె ఉపాధి కూలీల కోసం చలివేంద్రం అంబలి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.500 కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి జాబ్ కార్డు ఉన్న వ్యక్తికి పని కల్పించాలని కోరారు. మౌలిక వసతులు లేక వేసవికాలం కావడంతో కూలీలు అస్వస్థతకు గరవుతున్నారని, ప్రభుత్వం వెంటనే చొరవ చూపి కూలీలకు పనిముట్లు టెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మండల సర్వ సభ్య సమావేశంలో ఈ అంశాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లనున్న ట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాల్య నాయక్,బాబు నాయక్, మహిళ సంఘం నాయకురాలు చిట్టెమ్మపాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే, జడ్పీచైర్మన్‌లు రాక

**దేవరకద్ర,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** దేవరకద్ర,కౌకుంట్ల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,జడ్పీచైర్మెన్ స్వర్ణసుధాకర్‌రెడ్డిలు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా దేవరకద్రలో ఉదయం 9.30లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రెస్ మీట్ కార్యక్రమంలో పాల్గొంటారు.అలాగే 10.30లకు దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్‌లో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా రూ.33లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు.11.30లకు కౌకుంట్ల మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను అందజేస్తారు.కావున ఈ కార్యక్రమాలకు ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరు కావాలని యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్,బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డిలు కారారు.

## గ్రామాలను స్వచ్ఛ నిలయలుగా నిలుపుదాం!



స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**వెల్దండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ ఫేస్–2 అమలుపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు 3 రోజుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవన్‌లో ఎంపీపీ విజయజైపాల్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ ఊషన్న, ఎపీఎం రాములు మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాలుగా నిలుపేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని, ఇంటిలోని వృథా నీరు బయట పారించకుండా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, ఇంటింటికి చెత్త చెత్త సేకరణ, కాలనీల పరిశుభ్రతలు లేకుండా శుభ్రతగా ఉంచాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సౌకర్యాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ స్వచ్ఛ గ్రామాలుగా నిలుపాలన్నారు. కార్యక్రమంలో ఫారుఖ్‌హుస్సేన్, దేవేందర్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## జాతీయ అగ్నిమాపక వారోత్సవాలపై అవగాహన



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** జాతీయ అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా తాడూర్ మండల కేంద్రంలోని సత్యసాయి శీతల గిడ్డంగిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో అగ్నిమాపక అధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పరిశ్రమలు, గోదాముల యందు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్ని మాపక యంత్రాలు ఉపయోగించడంలో శిక్షణను సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది జీ.రాఘవేందర్, డి.నాగేష్; జగన్మోహన్‌గౌడ్, రవికుమార్‌లు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కల్వకుర్తి వెంకటరమణ ఆసుపత్రి, యశోద ఆసుపత్రి వారి సంయుక్తంగా డాక్టర్ వీరమల్ల శరత్‌తో కలిసి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, డాక్టర్లు ఇచ్చే సూచనలు, సలహాలుఎంతో ఉపయోగపడనున్నాయి.రోగులకు వైద్య పరీక్షలునిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో ఫిజియోథెరఫిస్ట్ నాగరాజు, గ్రామస్తులు శంకర్, నారాయణరెడ్డి, ఆనంద్, సత్యంతో పాటు తదితరులు ఉన్నారు.

## గిరిజనుల ఆకాంక్ష మేరకు సేవలందిస్తా..

### -జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.కమలాకర్‌రెడ్డి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాత వార్త:** గిరిజనుల ఆకాంక్ష మేరకు తాను సేవలందిస్తానని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలను స్వీకరించిన పి.కమలాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో డీటీడబ్ల్యూఓగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ గారు తనపై నమ్మకంతోనే జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారని, వారి అంచనాలకు అనుగుణంగా తాను జిల్లా షెడ్యూల్డ్ తెగల ప్రజలను సామాజికంగా, విద్యాపరంగా మరియు ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తానన్నారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా వ్యవహరిస్తూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి వారికి ఉత్తమ సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు..

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి, కాంగ్రెస్ నాయకులు



**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం 9 ఏళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి టిఆర్ఎస్ పార్టీలోకి నిరంతరంగా చేరుతున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని ఈదులబాయ్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కాటోనిగడ్డ తండాకు చెందిన బిజెపి మండల గిరిజన మోర్చా నాయకులు దేశనాయక్ తండా గ్రామ అధ్యక్షుడు రమేష్ నాయక్, కాంగ్రెస్ గ్రామ యువ నాయకులు గోపాల్‌నాయక్ వివిధ పార్టీల 10 మంది యువ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ పవర్, ఈదులబాయితండా గ్రామ సర్పంచ్ భాస్కర్ చౌహాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బిఆర్ఎస్ టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీకి కార్యకర్తలే కీలకమని ఎల్లప్పుడు వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ చౌహాన్, మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ పవర్, మండల బిఆర్ఎస్ యువ నాయకులు నానునాయక్, దేవ్యనాయక్, పీకా నాయక్, దశ్రునాయక్ పాల్గొన్నారు.

## 25న జడ్చర్లలో టిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశం 5000ల మందితో నిర్వహించాలి

- 27న బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి
- ప్రతివార్డు, గ్రామం, మండలంలో పార్టీ జెండా ఆవిష్కరించాలి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపు



**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఈ నెల 27న బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం అన్న విషయం మనందరికి విదితమే. ఈ నేపథ్యంలో దానికి రెండు రోజుల ముందు ఈ నెల 25న నియోజకవర్గంలో పార్టీ ప్రతినిధుల సమావేశం కనీసం 5 వేల మందితో నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాలు, మండల, మున్సిపల్ వార్డుల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ యువత అధ్యక్ష, కార్యదర్శులు,మహిళా అధ్యక్ష, కార్యదర్శులు,నియోజకవర్గంలోనిఅన్ని స్థాయిల వార్డు మెంబర్లు,సర్పంచ్‌లు,ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, సింగిల్ విండో, రైతుబంధు సంఘాల అధ్యక్షులు,ఎంపిపి, జడ్పీటిసి తదితర ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి బయలుదేరడానికి ముందు ప్రతి వాడ, ప్రతి వార్డు, ప్రతి గ్రామం, ప్రతి మండల కేంద్రంలో తప్పనిసరిగా బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించి బయలుదేరాలని పిలుపునిచ్చారు. 22 వసంతాల బిఆర్ఎస్ పార్టీ ప్రయాణం పూర్తి చేసుకుని 23వ ఏట అడుగు పెడుతున్న మన పార్టీ టిఆర్ఎస్‌గా ప్రస్థానం మొదలుపెట్టి బిఆర్ఎస్ పార్టీగా అవతరించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిలా నిలబెట్టడమే కాకుండా భారత రాజకీయాల్లో క్రియాశీల పాత్రపోషించే రాజకీయ శక్తిగాపురోగమించ బోతున్నదని తెలిపారు. ఈ పరిస్థితులలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత గల అంశంగా భావించి నియోజకవర్గంలో ముందస్తు సమావే శాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించారని తెలిపారు. ఇది మన మందరం కలిసి సమిష్టిగా విజయవంతం చేయాలని విజ్ఞప్తి

# గడీల సంస్కృతిని తలపిస్తున్న ఆల..

- ఐదేళ్లుదాటిన ప్రారంభానికి నోచుకోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం
- కాంట్రాక్టులు, కమీషన్లు తప్ప కార్యాలయాలపై దృష్టి పెట్టని ఎమ్మెల్యే
- ఆల వైఖరిపై మండిపడ్డ రాచాల..



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని త్వరగా ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకద్రలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనే వ్యక్తి పార్టీ కార్యకర్తలకే కాకుండా నియోజకవర్గ ప్రజలందరికి అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం అన్ని నియోజకవర్గాలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు మంజూరు చేసిందని అన్నారు. అందులో భాగంగానే దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో క్యాంపు కార్యాలయానికి 2018 మార్చి 23వ తేదీన శంకుస్థాపన చేశారని, ఐదేళ్లు దాటినా నేటికి ప్రారంభిచకపోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గడీల సంస్కృతిని తలిస్తున్నారని, నియోజకవర్గ ప్రజలను తన ఇంటకి రప్పించుకోవాలన్న దురుద్దేశంతోనే కార్యాలయాన్ని ప్రారంభం చేయట్లేదని ఆరోపించారు. తన పార్టీ కార్యకర్తలు కాకుండా తటస్తులకు ఇంటికి వెళ్లి కలవడం చాలా ఇబ్బందిగా ఉంటుందని, ఆత్మాభిమానం చంపుకొని ఆయన ఇంటికెళ్లి ఎలా కలుస్తారని ప్రశ్నించారు. అధికార కార్యాలయం అయితే కలవడానికి ఎవరికి ఇబ్బంది ఉండదన్న సంగతి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించడం ఎలాగూ చేతకాదు..మీకార్యాలయం ప్రారంభించడంకూడా చేతకాదా అని విమర్శించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి దేవరకద్రలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని లేనిపక్షంలో ఎన్నికలయ్యాక మేమే ప్రారంభించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు అంజన్న యాదవ్, కట్టా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# 3వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డును మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగులుయాదవ్‌తో కలిసి పర్యటించి వార్డుల్లో సిసి రోడ్డు, డ్రైనేజీతో కలిసి పర్యటించి వార్డుల్లో సిసి రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు ట్రీ పార్కు, విద్యుత్ సమస్యలు, తదితర సమస్యల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వార్డులలో సిసి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ట్రీపార్కు, విద్యుత్ సమస్యలు తదితర సమస్యలపై మిషన్ భగీరత పైప్‌లైన్‌కొరకు తవ్వీన గుంతలు వార్డులలో ఎక్కడ ఉన్న వెంటనే పూడ్చివేయాలన్నారు. డ్రైనేజీల వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటిని మరమ్మతులు చేయడం మురుగు కాలువలు, చెతాత చెదారం ఎప్పటికప్పుడు లేకుండా వార్డు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జవాన్లకు ఆదేశించడం జరిగింది. త్రాగునీటికి, విద్యుత్ సమస్యలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వెంటనే వాటిని పరిష్కరిస్తామని వార్డు ప్రజలకు చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఆయకులు భగీరథ వంశి, నర్సింహ, బి. శంకర్, నారాయణ,కృష్ణ, సెల్ నర్సింహ, దుబ్బన్న, సురేష్, గంగాధర్‌రెడ్డి, అయ్యప్ప, డిజిటల్ సిద్దు, మున్సిపల్ అధికారులు డిఇ,ఏఇ వాటర్ లైన్‌మెన్, యూత్ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎండిన వరి, వేరుశనగ పంటల పరిశీలన



ఎండిన వరి పొలాలను పరిశీలస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తి రూరల్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో ఎండిన వరి, వేరుశనగ పంటలను రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, మండల బీజేపీ ఇంచార్జ్ బి.కృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పెద్దిరాజు, మండల బీజేపీ నాయకులు బాలరాజు, రాఘవేందర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రైతులు లక్షలు పెట్టుబడి పెట్టి నేడు ఎండిన పంటలను చూసి రైతులు తల్లడిల్లుతున్నారని,ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉందని గత 10సంవత్సరాల కిందట సాగునీటి పొలానికి కాల్వలు తవ్వి ఆ సంవత్సరం కాల్వల నుండి నీళ్లు వచ్చి చెరువులు నిండిన తరువాత మళ్లీ ప్రభుత్వం నిర్లక్ష్యం గత10 సంవత్సరాల నుంచి నీరు రావడం లేదు అని అన్నారు. నష్టపర్యాయం చెల్లించలేదని, రైతులు కాల్వలను మూసి వేశారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రాతినధ్యం వహిస్తూ చందాపూర్ గ్రామ ప్రజలు రైతులు వారి బాధలు అనేకసార్లు వారి దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. చందాపూర్ గ్రామానికి సాగునీటి అవకాశం ఉన్న శ్రద్ధ చూపడం లేదని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చందాపూర్ అంతా సస్యశ్యామలమవుతుందని, ఆ గ్రామ ప్రజలు ఆశించారని, తెలంగాణ రాష్ట్రం కోసం గ్రామ ప్రజలు పెద్దఎత్తున ఉద్యమాలు చేశారని అన్నారు. అయిన వాళ్ల బ్రతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చందాపూర్ గ్రామ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎండిన పంటకు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సాగునీటి సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


# ఈద్గా వద్ద అన్ని వసతులు కల్పించాలి

### -వేసవిలో నమాజ్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలి -తాగునీటి వసతిని కల్పించాలి : మున్సిపల్ చైర్ పర్సన్ కల్పన భాస్కర్‌గౌడ్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్‌లోని శ్రీపురం రోడ్డుల గల ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా నిర్వహించుకునే ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ కోసం అన్ని ఏర్పాట్లు ఘనంగా చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ కల్పన భాస్కర్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ కమి షనర్ జయంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా మైదానం మొత్తం కప్పబడే విధంగా బెండాల్స్ ఏర్పాటు చేయాలని, వేసవి కావడంతో ఇబ్బందులు లేకుండా తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. అంతకు ముందు ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లిం ప్రజా ప్రతినిధులు ఈద్గా వద్ద ఏర్పాటు చేయాల్సిన అంశాలనువారి దృష్టికి తీసుకొచ్చారు. వీరితో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మొహ మ్మద్ ముస్తాక్ అహ్మెద్,కౌన్సిలర్ మొహమ్మద్ ఖాజాఖాన్, వక్ఫ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ కమిటీ బాధ్యులు షేక్ ఫరీద్ అహ్మెద్, అబ్దుల్లా ఖాన్, బీఆర్ ఎస్ నాయకులు భాస్కర్‌గౌడ్, కొత్త గంగధర్, మహమూద్ తదితరులు ఉన్నారు.

## బలిగె శివారెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న డికె అరుణ



**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:**

ఇటీవల హైద్రాబాద్ యశోద ఆసుపత్రిలో గట్టు మండల బిజెపి అధ్యక్షులు బలిగె శివారెడ్డి గుండెకు స్టంట్ వేయించుకున్న విషయం తెలిసి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ గట్టు మండలం శివారెడ్డి స్వగృహంలో పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న 27వ వార్డు కౌన్సిలర్ దంపతులు



**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని నడిగడ్డ ఇలవేల్పు దైవం కొంగు బంగారంగా వెలుగొందుతున్న శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారు, పరశురామస్వామి వారిని 27వ వార్డు కౌన్సిలర్ దంపతులు ఎన్‌బి మురళిలక్ష్మి మంగళవారం జములమ్మ అమ్మవారిని చేస్తున్న సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం జములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సతీష్‌కుమార్ కౌన్సిలర్ దంపతులు ఎన్‌బి మురళి లక్ష్మిలను శాలువాతో ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు,ఆలయ కమిటి డైరెక్టర్ కమ్మరి రాము, భక్తులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు



**ధరూర్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ క్రిష్ణ బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మన్నాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ కురువ పెద్ద భీమన్న, బిజెపి సీనియర్ నాయకురాలు తిమ్మప్పవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్ అయ్య, బిజెపి సీనియర్ నాయకులుధరూర్ కిష్టప్ప,హన్మంతురాయ, రామకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎల్ఎన్ అంత్య పరీక్షను పరిశీలించిన మండల విద్యాధికారి



పరీక్ష సరళిని పరిశీలిస్తున్న మండ విద్యాధికారి

**ఉట్కూర్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మంగళవారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ అంత్య పరీక్షను సమర్థవంతంగా నిర్వహించారు. ఉట్కూర్ మండల విద్యాధికారి వెంకటయ్య పరీక్ష సరళిని పరిశీలించారు. ఇందులోభాగంగా విద్యార్థుల ప్రతిస్పందన చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఒక్కరోజు మూడు పరీక్షలు నిర్వహించి మూల్యాంకనం కూడా పూర్తిచేసి సంబంధించిన రిపోర్టును మండల వనరుల కేంద్రానికి, సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు. అలాగే పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు మనబడి పనుల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వీలైనంత త్వరగపూర్తి చేసి మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేసుకోవాలని వీలైనంతత్వరగా పాఠశాలనుఅన్ని హంగులతో ప్రారంభించుకోవడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, ఉపాధ్యాయులు సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాఖత్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖకు సంబంధించిన పాత వస్తువులు బహిరంగ వేలం

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయంలో ఉన్నపాత వస్తువులు అయిన షామియానాలు, రెడ్ కార్పెట్స్, సైడ్ వాల్స్,రైన్‌కోట్స్, వెబ్ ఆర్టికల్స్, హ్యాండ్ కఫ్స్, డ్రాగన్ లైట్స్,పాలి కార్పోరేట్ లాటిస్,పాలి కార్బోనేట్ స్టోన్ గార్డ్స్, ఐరన్ స్ట్రాబ్స్, ఇతర వస్తువులు అమ్మడానికి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ కె.సృజన తెలిపారు. ఈవేలం పాటలో గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన హిదాయత్ అనే వ్యక్తి అత్యధికంగా వేలంపాట ద్వారా 41 వేల రూపాయలకు పాత వస్తువులు కొన్నారని, ఇందుకోసం నియమించిన కమిటి సమక్షంలో వేలం వేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ బహిరంగ వేలంలో సాయుధ రిజర్వ్ డీఎస్పీ ఇమ్మానుయేల్, సూపరింటెండెంట్ నాగేందర్, ఎస్బీ, డిసిఆర్బి ఇన్స్‌పెక్టర్ శివకుమార్, శ్రీనివాస్, ఆర్ఐ నాగేష్, వేలం పాటకు వచ్చిన బిడ్డర్స్ పాల్గొన్నారు.

## ఖిల్లాలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



**వనపర్తి టౌన్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ జగదీష్ మాట్లాడు తూ ఘణపూర్ మండల కేంద్రం నుంచి రోజుకు 1000–1500 మంది విద్యార్థులు డిగ్రీ చదవడానికి రోజు 35–40కిమీ జర్నీ చేసి చదువు కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ విధంగా దూరపు ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక చాలా మంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. చదువుకు విద్యార్థులు చదువుకు దూరం కావొద్దని మాకు ఇక్కడ డిగ్రీ కళాశాల కావాలని 4నెలల క్రితం ఎంఆర్‌ఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దాన్ని వారు పట్టించుకోకుండా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. దీని కొందరు నాయకులు డిగ్రీ కళాశాల కొరకు ఉన్న భూమిని కూరగాయల మార్కెట్ చేయడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. కావున దయచేసి విద్యార్థులు జీవితాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా స్పందించాలని లేనిచో రాబోయే రోజుల్లో దీన్ని మరింత ఉధృతం చేసిఎంఆర్‌ఓ ఆఫీస్‌ముట్టడి నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ ఆనంద్,మణి, పవన్, శ్రీకాంత్, శివ, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవరకద్ర ఎస్ఐకి టీపీసీసీ ఓబిసి ఉపాధ్యక్షుడి సన్మానం



**దేవరకద్ర,ఎప్రిల్ 18 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొత్త ఎస్ఐగా పదవి భాద్యతలు చేపట్టిన జి.వెంకటేశ్‌కు మంగళవారం టీపీసీసీ ఓబిసి ఉపాధ్యక్షుడు రాజమూరి శ్రీనివాసులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసి పూల మాల వేసి శాలువాతో సత్కరించారు.

## కౌకుంట్లలో ఇమామ్,మౌజన్‌లకు సన్మానం



ఇమామ్,మౌజన్‌లకు సన్మానిస్తున్న తుమ్మలశేఖర్‌రెడ్డి

**దేవరకద్ర,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో సోమవారం రాత్రి స్థానిక మజీద్‌లో ఇమామ్,మౌజన్‌లకు ఘనంగా సన్మానించారు. స్థానిక ఉమ్మడి దేవరకద్ర మండలం వైస్ యంపీపీ తుమ్మలసుజాత శేఖర్‌రెడ్డి రంజాన్ సందర్బంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా పూలమాలలు వేసి తోఫాలతో సత్కరించారు. ప్రతి ఏడాది ఇమామ్, మౌజన్‌లకు వైస్ యంపీపీ తుమ్మలసుజాత శేఖర్‌రెడ్డి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ యంపీపీ తుమ్మలసుజాత శేఖర్‌రెడ్డితో పాటు నాయకులు తుమ్మలశేఖర్‌రెడ్డి,శ్రీకాంత్,శివకుమార్‌లతో పాటు నాయకులుస్థానిక ముస్లిం సోదరులు,ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు మంజూరుకై ఎమ్మెల్యేకు వినతి



**వెల్దండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామం నుంచి కలిమిరాళ్ల తాండ వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నివాసంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ బీటీ రోడ్డు మంజూరుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ పత్యనాయక్, నాయకులు గోపాల్‌నాయక్, పాండునాయక్, రమేష్‌నాయక్, వెంకటేష్, నవీన్, సురేష్, పవన్ తదితరులు ఉన్నారు.

## ముస్లిం సోదరులకు బట్టల పంపిణీ



**అడ్డాకుల,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిదిలోని పొన్నకల్ గ్రామంలోని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా మైనార్టీ సోదరులకు ఎంపీపీ నాగార్జున్ రెడ్డి బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ మహ్మద్,సర్పంచ్ కల్పన,విజయ్ కుమార్‌రెడ్డి, సింగిల్‌విండో నెంబర్‌కృష్ణయ్య,పార్టీనాయకులు,కార్యకర్తలు,మైనార్టీసోదరులు పాల్గొన్నారు.

## బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారిణిగా బి.రాజేశ్వరి అదనపు బాధ్యతల స్వీకరణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతులు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖల అధికారిణిగా డీఆర్డీఎ అదనపు పీడీ బి.రాజేశ్వరి మంగళవారం మధ్యాహ్నం ఆయా సంక్షేమ శాఖల కార్యాలయాల చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆమె ఆయా సంక్షేమ శాఖల కార్యాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించి నాగర్‌కర్నూల్ జిల్లాలో సంక్షేమ శాఖలో అమలుపరుస్తున్న పథకాల అభివృద్ధి వివరాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల వివరాలు తదితర అంశాలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తనకు అప్పగించిన సంక్షేమ శాఖల అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, జిల్లా అభివృద్ధికి పాటు పడుతానని ఆమె పేర్కొన్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బాధ్యతల నుంచి రిలీవ్ అయిన అనిల్ ప్రకాష్ బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాష్ డిప్యూటేషన్‌పై వనపర్తి బీసీ వెల్ఫేర్ అధికారిగా బాధ్యతలను నియమిస్తూ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్యదర్శి బుర్ర వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ బీసీ వెల్ఫేర్ బాధ్యతల నుంచి రిలీవ్ అయిన అనిల్ ప్రకాష్ తేదీ:01-09-2018 నుంచి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారని, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా నుంచి కలెక్టర్ రిలీవ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో తాను సమర్థవంతంగా పనిచేసినందుకు,సహకరించిన ప్రతి ఒక్కరికి అనిల్ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

## 25న ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీల ప్రజాసంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంఘాల నాయకులు

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఈనెల 25న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో ఉదయం 10:30 గంటలకు యాదవ సంఘం భవనంలో జరపబడుతుంది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి వనపర్తి జిల్లాలోని అన్ని ప్రజా సంఘాలు, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు వస్తావని, ఈ సమావేశానికి కలిసి కట్టుగా, మూకుమ్మడిగా నాయకత్వం వహిస్తారు. వనపర్తిలో నాయకత్వం ఉన్న ఎవ్వరిని కూడా ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థి కాకుండా చేస్తున్న అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిలో అత్యధికంగా ఉన్న ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీల హక్కులను కాపాడుతూ, మేమే ఎమ్మెల్యే కావాలని ఈనాటి నుండి పోరాటం చేయాలని,ఎవరు యాక్టివ్‌గా ఉండి ముందుకు వస్తారో వారిని అభ్యర్థిని చేసి ముందుకెళ్తామని, ఈ అభ్యర్థిని తయారు చేస్తామని, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అజెండాగా పెట్టుకుని ముందుకు వెళ్తామని ఐక్యంగా ప్రకటిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యవేదిక ఒక ప్రకటనలో తెలిపారు.

## వేసవి కాలంలో విద్యార్థులకు జవహర్ బాల కేంద్రంలో శిక్షణ కార్యక్రమం



జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** కళాకారులకు నిలయం అయి న జిల్లా కేంద్రంలోని జవహర్ బాల కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీనుండి విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జవహర్ బాల భవన్‌లో గాత్రం, సితార,నృత్యం, తబల, చిత్రలేఖనం అంశాలపై శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని జవహర్ బాల కేంద్రంలో రూ. 50 లు ఎంట్రీ ఫీజు చెల్లించి అడ్మిషన్ తీసుకోవాలన్నారు.

# రైతులకు వ్యవసాయ ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు

### - ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు అన్నారు. మంగళవారం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం ప్రారంభోత్సవానికి ప్రత్యక్షంగా హజరైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రాజేష్‌బాబు, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సబితా, అచ్చంపేట కోర్టు న్యాయమూర్తి విజయ్‌కుమార్‌లతో కలిసి వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు తెలంగాణ ఆదేశాల మేరకు రైతులకు వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేసి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ద్వారా రైతులు ఉచితంగా న్యాయం పొందాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా విస్తీర్ణంలో పెద్ద జిల్లా కావడంతో ఏజెన్సీ ఏరియాలో కూడా వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో మన్ననూర్ ఎంపిక చేసినట్లు తెలిపారు. వ్యవసాయ న్యాయ సలహా కేంద్రంలో రైతుల భూవిదాలు ఇతర న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్యార లీగల్ వాలెంటరీస్ కమిటీ ఏర్పాటు చేసుకొని బాధిత రైతులు ఇచ్చిన ధరఖాస్తులను సేకరించి వాటిని జిల్లా న్యాయమూర్తుల సమక్షంలో పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. ప్రతి శనివారం వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం ధరఖాస్తులను సేకరిస్తుందని, న్యాయ పరిష్కారంకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సర్పంచ్ శ్రీరాంనాయక్, ఎంపీ టీసీ శ్రీను, ఎస్ఐ పి.వీరబాబు, భార్ ప్రెసిడెంట్ శ్రీధర్, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, ఏఓ టీ సందీప్‌కుమార్, ఏఈఓ సీతారాం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

### -కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి



విద్యార్థులకు క్రీడా కిట్స్ అందజేస్తున్న ధ్యాప నికిల్‌రెడ్డి

**ఊర్కొండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఊర్కొండ మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మండల విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలోని విద్యార్థులే రేపటి నవసమాజ నిర్మాతలని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలని కోరారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనలో నిమగ్నం కావాలన్నారు. మంచి భవిష్యత్తు నిర్మాణం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు కంతం విజయుడు, నాయకులు ఆది నారాయణ, గోపి, అచలేష్, ప్రణీత్, వినయ్ తదితరులు ఉన్నారు.

## ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంగూరు రాములు

**వనపర్తి టౌన్,ఏప్రిల్18 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కొనుగోలు కేంద్రాల ఆల్ హమాలీ సంఘం(సీఐటీయు అనుబంధ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు శాంతయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.10లక్షలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల వలె ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న హమాలీలకు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 29న సంక్షేమ బోర్డు సాధనకై ఛలో హైదరాబాద్ లేబర్ కమీషనర్ కార్యాలయానికి హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం హమాలీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు-కార్మికుల పై ప్రభావం-కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల గురించి వంగూరు రాములు వివరించారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కార్మికులు,రాజకీయాలు, మతోన్మాద ప్రభావం అనే అంశంపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ల అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, బాలయ్య, రాములు, పెంటయ్య,ఎల్లయ్య, నాగన్న, రామస్వామి, శివ, శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం

● సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా సహాయకార్యదర్శి గోపాలకృష్ణ

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఐకెపీ విఓఏల సమస్యల పరిష్కారం కోసం సమ్మె రెండోరోజుకు చేరుకుంది. వనపర్తి పట్టణంలో రెండోరోజు వెలుగు కార్యాలయం ముందు జరిగిన సమ్మెలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఐకెపీ వీఓఏ లు తమ న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారం కోసం సమ్మె బాటపట్టారని, కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన పాలక ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించకపోగా కార్మికుల శ్రమను యదేచ్ఛగా దోచుకుంటున్నారని అన్నారు. ఐకెపీ వీఓఏ లు నెలకు నూ.3900తో కుటుంబాన్ని, పెళ్లాం పిల్లల్ని ఎలా పోషించుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్మి కులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఏఎస్ఐ సౌకర్యం కల్పించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అర్హులైన ఐకెపీ విఓఏ లకు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని, ప్రమాద భీమా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె కోపుల మహేష్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపీ వీఓఏ కార్మికులు దేవేందర్, భరత్, చందు తదితరులు పాల్గొన్నారు.

## కరీఫ్ వడ్లను అన్ని మిల్లులకు కేటాయించండి

● కలెక్టర్‌ను కలిసిన జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** 2023 సంవత్సరం కరీఫ్ కు సంబందించిన వరి ధాన్యాన్ని జిల్లాలోని అన్ని బాయిల్డ్, రా రైస్ మిల్లులకు కేటాయించి వరి కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 142 రా రైస్ మిల్లులు, 10 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయని, గతంలో ఏ విధంగా కేటాయింపులు జరిగాయో అలాగే అన్ని మిల్లులకు వరి ధాన్యాన్ని కేటాయించాలని జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఈ కరీఫ్ సీజన్‌లో పంట దిగుబడి రానుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు పరమేష్, సంఘం నాయకులు రాజప్రకాష్‌రెడ్డి, వెంకటస్వామి, అంగడి నరేందర్, తదితరులు ఉన్నారు.

## హమాలీ కూలీలకు జిల్లా వ్యాప్తంగా ఒకే వేతనం ఇవ్వాలని వినతి



అదనపు కలెక్టర్‌కి వినతిపత్రం అంజేస్తున్న సీఐటీయు నాయకులు

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా బజార్ రైస్ మిల్లు కొనుగోలు కేంద్రాల ఆల్ హమాలీ సంఘం సీఐటీయు అనుబంధం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ కి కొనుగోలు కేంద్రాల కూలి రేట్లు పెంచాలని జిల్లా వ్యాప్తంగా ఒకే వేతనం ఇవ్వాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. జిలాంల వ్యాప్తంగా రూ.45వేతనాలు పెంచుతూ జీఓ సర్క్యులర్ అందజేశారని, అదే విధంగా వనపర్తి జిల్లాలో కూడా అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఐకెపి పీఏసీసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ఒక వేతనం ఇచ్చే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. తాడు మామూలు పెంచాలని,వనపర్తి జిల్లాలో క్వింటాకు రూ.32 నుండి రూ.45 మధ్య కూలీ రేట్లు ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా ఇస్తున్నారని అందరికి ఒకే వేతనం రూ.45 చెల్లించాలని తాడు మామూలు రూ.200 నుంచి400వరకు ఇస్తున్నారని రూ.600తాడు మామూలు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాల్లో నీటి వసతి,నీడ వసతి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రేపే చర్చిస్తామని, తప్పక వితరణ ఒప్పందం చేసేందుకు ప్రయత్నం చేస్తాననిహామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాములు ఉన్నారు.

## వికలాంగులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలి

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వికలాంగులకు నెలకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలని వికలాంగుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్ లతో ఏప్రిల్ 26న మహబూబామాద్ లో నిర్వహించనున్న బహిరంగ సభ కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం ఉపాధికి రూ.15లక్షలు, విద్యార్హత ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా పట్టణ నాయకులు కృష్ణయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు,కుశ కుమార్,నాగేషు,లక్ష్మయ్య, విజయ్, మురళి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## బార్ కౌన్సిల్ అధ్యక్షుడు మోహన్ కుమార్ యాదవ్‌ని సన్మానించిన మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్



**వనపర్తి టౌన్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నుకోబడిన మోహన్ కుమార్ యాదవ్‌ను మున్సిపల్ కౌన్సిల్ తరుపున మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్ లు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కంచరవి నాగన్న, పాగనాటి కృష్ణ,గోపాల్ యాదవ్,నక్క రాములు, నక్క మహేష్, బీచుపల్లి యాదవ్.ఫైర్‌స్టేషన్ నరసింహ, మహేష్, చిలక సత్యం, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్య మహాసభ నేతలు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విద్యాకమిటీ చైర్మన్, శ్రీశైలం మల్లిఖార్జున అన్నసత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు,సత్రం డైరెక్టర్ బచ్చు రామకృష్ణ, సత్రం కార్యదర్శి బలుసశ్రీరాములు, డైరెక్టర్లు మేడిశెట్టి సురేష్,ఉప్పు ఆంజనేయులు, పోల విష్ణు,జిల్లా పీఆర్ఓ మిర్యాల రాజయ్యలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మే నెలలో నిర్వహించే మల్లిఖార్జున అన్నదాన సత్రం ప్రారంభోత్సవానికి విచ్చేయాలని రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. అన్నదాన సత్ర ప్రారంభోత్సవానికి విచ్చే స్తానని సూచిస్తూ ఆర్యవైశ్య మహాసభ నేతలను అభినందించారు. అంతకు ముందు జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వంట కార్మికులకు కాంగ్రెస్ తరుపున ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తాం



**వెల్దండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన వంట కార్మికులు హైదరాబాద్‌లోని ఓ శుభకార్యంలో వంటలు చేసి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మహేశ్వరం వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై కారు రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మృతులకు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలు కలిగి ఉన్నారని యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కొండలుయాదవ్ తెలిపారు. గాంధీ భవన్‌లో సభ్యత్వ పత్రాలను అందించామని, ఆ కుటుంబాలకు త్వరలోనే ఇన్సూరెన్స్ అందేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు.

## మేము సైతం ఐక్యత చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సేవలో..



జాబ్ మేళాపై అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**వెల్దండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** గ్రామ గ్రామాన నిరుద్యోగ యువకులను జాబ్ మేళాలో సన్నద్ధం చేస్తున్నామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అమెరికాను వదిలి మాతృభూమి సేవకై విచ్చేసి కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆయన చేస్తున్న కృషిలో భాగంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు గ్రామ గ్రామాన పర్యటించి యువతీ, యువకులను జాబ్ మేళాకై సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మే నెలలో 6వ తేదీన కల్వకుర్తి పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 3వేల ధరఖాస్తులు వచ్చాయని, జాబ్‌మేళాకు యువతీ యువకుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని ఫౌండేషన్ సభ్యులు సురేష్‌రెడ్డి, మల్లయ్య, రమేష్‌నాయక్, కొండలుయాదవ్, చంద్రశేఖర్, జగన్ తదితరులు పేర్కొన్నారు.

## కౌకుంట్లలో వైస్ ఎంపీపీ ఇఫ్తార్ విందు



**దేవరకద్ర,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఉపవాసదీక్షలున్న ముస్లింసోదరులకు స్థానిక ఉమ్మడి దేవరకద్ర మండలం వైస్ యంపీపీ తుమ్మల సుజాత శేఖర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక జామీయ మజీద్ వద్ద ఈ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రతి ఏడాది ముస్లిం సోదరులకు వైస్ యంపీపీ తుమ్మలసుజాత శేఖర్‌రెడ్డి విందు ఇస్తారు. అందులో భాగంగానే ఈ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ యంపీపీ తుమ్మలసుజాత శేఖర్‌రెడ్డితోపాటు నాయకులు తుమ్మల శేఖర్ రెడ్డి,శ్రీకాంత్,శివకుమార్‌లతో పాటు నాయకులుస్థానిక ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

**కొత్తకోట,ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల ఐకెపి వీఓఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రెండవ రోజు మంగళవారం సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు నిక్సన్ మాట్లాడుతూ ఐకెపి విఓల ను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు, రూ.10లక్షల భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. పెండింగ్ వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ,అరుణ, శ్రీలత, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

